నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

3 | ఖమ్మం, శనివారం 10 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM

మేజర్లు, మైనర్లకు పాలేరు నీరు విడుదల

- రిజర్వాయర్‌కు 3,899 క్యూసెక్కుల నీరు రాక
- ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 20.35 అడుగులు

కూసుమంచి, ఆగస్టు 9 : నీటిపారుదల శాఖ అధికారులు సాగర్ ఆయకట్టు పరిధిలోని అన్ని మేజర్లు, మైనర్లకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. వానకాలం సాగుకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పాలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన విషయం విదితమే. అయితే క్రమంగా నీటి విడుదల సామర్థ్యం పెంచుతూ శుక్రవారం వరకు 4 వేల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి పాలేరు జలాశయానికి 3,899 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. పాలేరు చానల్‌కు 320 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 135 క్యూసెక్కులు, రెండో జోన్‌కు 2,126 క్యూసెక్కులు, వరద ద్వారా 270 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అలాగే భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా 275 క్యూసెక్కులు, నందిగామ బ్రాంచ్ కాలువకు 430 క్యూసెక్కులు, మంగాపురం మేజర్‌కు 77 క్యూసెక్కులు, క్రాస్ రెగ్యులేటర్‌కు 1,125 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 20.35 అడుగులు ఉంది.

పాలేరు నుంచి ఎడమ కాలువ రెండో జోన్‌కు విడుదలవుతున్న సాగర్ జలాలు

కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

కుమ్రం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

సత్తుపల్లి : నృత్యం చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

- నాగరికతను కాపాడుకోవడంలో వారు ఆదర్శంగా ఉన్నారు
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం
- గిరిజనులకు సేవచేసే అవకాశం అదృష్టం: కలెక్టర్, పీవో
- భద్రాచలం ఐటీడీఏ గిరిజన భవన్‌లో ఆదివాసీ వేడుకలు

ఆదివాసీ తలపాగా ధరించి డోలు వాయిస్తున్న పీవో

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే, ఎస్పీ, ఆదివాసీ నేతలు

బూర్గంపహాడ్/మణుగూరు టౌన్/అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 9 : ఆదివాసీలందరూ తమ సంస్కృతిని కాపాడుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆకాంక్షించారు. అయితే ఇతిహాసాలు, నాగరికతను పాటించడంలో వారు ఇప్పటికీ ఆదర్శంగా ఉన్నారని అన్నారు. అలాగే ప్రపంచ దేశాలు కూడా ఆదివాసీల సంప్రదాయాలను గౌరవిస్తే ఆదివాసీ తెగ అంతరించిపోకుండా ఉంటుందని అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో పీవో రాహుల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, గంటం దొర, మల్లు దొర వంటి ఎందరో ఆదివాసీల త్యాగాల ఫలితంగానే ఆదివాసీ దినోత్సవం ఏర్పడిందని గుర్తు చేశారు. ఆదివాసీలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించడానికి 1982లో ఐక్యరాజ్యసమితి నెదర్లాండ్‌లో 140 దేశాల ప్రతినిధులు సమావేశమై ఆగస్టు 9ని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించినట్లు జ్ఞప్తికి తెచ్చారు. ఆనాటి నుంచి ఆదివాసీ తెగల గిరిజనులు ఈ రోజును వారి సంస్కృతీ సంప్రదాయాల పండుగగా జరుపుకుంటున్నారని అన్నారు. తొలుత ఐటీడీఏ పీవో రాహుల్, ఏపీవో డేవిడ్‌రాజ్, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు కలిసి ఐటీడీఏ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ గిరిజన ఆదివాసీ మహనీయుల విగ్రహాలకు, అమరవీరుల స్తూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ అగ్రభాగాన ఆదివాసీల సంప్రదాయ కొమ్ము నృత్యాలు, డప్పు వాయిద్యాలు అలరించాయి. మళ్లీ ఐటీడీఏకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

ఈ అవకాశం మా అదృష్టం : కలెక్టర్, పీవో, ఎస్పీ

ఆదివాసీలకు సేవచేసేందుకు కలిగిన ఈ అవకాశం తమ అదృష్టమని భద్రాద్రి కలెక్టర్ జితేశ్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. భద్రాచలం ఐటీడీఏలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో వారు మాట్లాడుతూ.. అడవులు అంతరించిపోకుండా ఆదివాసీలు కాపాడుతుండడం, అటవీ ఫలాలతో జీవనోపాధిని పెంపొందించుకోవడం అభినందనీయమని అన్నారు. ఆదివాసీ గిరిజనుల విద్య, సంక్షేమం, అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వాలు కూడా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని వివరించారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన ఆదివాసీ క్రీడాకారులను సన్మానించారు. ఆదివాసీ దినోత్సవ వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆదివాసీల అభివృద్ధికి తోడ్పడతాం: మెచ్చా, తాటి

అధికారం ఉన్నా లేకున్నా ఆదివాసీల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో వారు మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధనకు తాము ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయా మండలాల్లోని ఆదివాసీ అమరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశ్వారావుపేట సీహెచ్‌సీని మెచ్చా నాగేశ్వరరావు పరిశీలించారు.

ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి: రేగా

ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కోరారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మణుగూరులో కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో గిరిజన మహిళ ముర్ము దేశానికి రాష్ట్రపతి అయిన తర్వాతే ఆమె గ్రామానికి కరెంట్ వచ్చిందని గుర్తు చేశారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే, ఎస్పీ, ఆదివాసీ నేతలు

చదువుతోనే భవిష్యత్

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, ఆగస్టు 9 : మనిషి భవిష్యత్‌ను తీర్చిదిద్దేది చదువు ఒక్కటేనని, అందుకే విద్యార్థి దశనుంచే చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ నుంచి జడ్పీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మూలమన్నారు. ఆరోగ్యపరంగా ప్రకృతిలో మమేకమై సంతోషకరమైన జీవనం గడపడాన్ని ఆదివాసీల నుంచే సమాజం నేర్చుకోవాలన్నారు. అనంతరం జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి స్థానిక గిరిజన భవనంలో ఆదివాసీల జెండాను ఆవిష్కరించారు. కుమ్రం భీం, బిర్సా ముండా వంటి ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. గిరిజన సాంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏవో నారాయణ రెడ్డి, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఏసీఎంవోలు, హెచ్‌డబ్ల్యూవోలు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సంప్రదాయ ఆదివాసీ వృత్తుల వేషధారణలో విద్యార్థినులు

15న లక్షన్నర ఎకరాలకు సాగునీరు

- రూ.75 కోట్లతో రాజీవ్ లింకు కెనాల్ పూర్తి
- ఈ నెల 15న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వైరాలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వైరాటౌన్, ఆగస్టు 9 : మూడు నెలల్లో రూ.75 కోట్లతో పూర్తి చేసిన రాజీవ్ లింకు కెనాల్ ద్వారా ఈ నెల 15 నుంచి లక్షన్నర ఎకరాలకు సాగు నీరు అందించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వైరా నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం ఆయన రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ లింకు కెనాల్ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల15న వైరాకు రానున్నారని వెల్లడించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీని వైరా వేదికగా ఈ నెల 15న అమలు చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వైరా నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా డిప్యూటీ భట్టి విక్రమార్క శుక్రవారం రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.26.87 కోట్లతో మంచినీటి సరఫరా పథకానికి మున్సిపల్ కార్యాలయం ఎదుట శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన కలియతిరుగుతూ శిథిల భవనాలను పరిశీలించారు. 200 మంది వరకు విద్యార్థులున్న కళాశాలలో ల్యాబ్‌లు, సరిపోయినన్ని తరగతి గదులు లేక పోవడాన్ని ప్రిన్సిపాల్ నవీన జ్యోతి భట్టి దృష్టికి తెచ్చారు. దీనికి ప్రతిపాదనలు పంపించాలని డీఐఈవో రవిబాబును ఆయన ఆదేశించారు. అనంతరం రూ.33 కోట్లతో వైరా రివర్ కెనాల్ ఆధునీకరణతోపాటు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైరాలో వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసిన ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం వెళ్లారు. శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భట్టి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శివాలయం సమీపంలో రూ.65 లక్షలతో స్నానాల ఘాట్, రూ.4.20 కోట్లతో చెక్‌డ్యామ్, రూ.7.70 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం, రూ.3.20 కోట్లతో శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం ప్రహరీ, కళ్యాణ వేదిక, అభిషేక మండపం, ఐదు గదుల సత్రం, జీ ప్లస్ వన్ డార్మెటరీ హాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం నాగ్‌పూర్ అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే వెహికిల్ అండర్‌పాస్ నిర్మాణాల గురించి అధికారులతో సమీక్షించారు. ఎంత మేరకు వీలైతే అన్ని చోట్ల రైతులకు సౌకర్యంగా ఉండే విధంగా అండర్ పాస్ (బ్రిడ్జిలు నిర్మించాలని హైవే అధికారులకు సూచించారు. తొలుత హైదరాబాద్ ప్రజా భవన్ నుంచి రోడ్డు మార్గాన వైరాకు చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ చైర్మన్ జైపాల్ తదితరులు స్వాగతం పలికారు.

12న మంత్రి జూపల్లి పర్యటన

ఖమ్మం, ఆగస్టు 9 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నుంచి పర్ణశాల వరకు పర్యాటక అభివృద్ధి చేపట్టాలని రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపాదనలు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లితో తుమ్మల సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేయాలని మంత్రి జూపల్లిని తుమ్మల కోరారు. తుమ్మల విజ్ఞప్తి మేరకు ఈ నెల 12వ తేదీన ఉమ్మడి ఖమ్మంలో మంత్రి జూపల్లి పర్యటించనున్నారు. పాలేరు రిజర్వాయర్, కూసుమంచి శివాలయం, నేలకొండపల్లి బౌద్ధస్తూపం, భక్త రామదాసు ధ్యాన మందిరం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఖమ్మంఖిల్లాపై రోప్ వే, లకారం ట్యాంక్‌బండ్, వెలుగుమట్ల అర్బన్‌పార్కును మరింత అభివృద్ధి చేయాలన్నారు. వైరా రిజర్వాయర్, కిన్నెరసాని ప్రాజెక్టు, భద్రాచలం కరకట్ట వద్ద టూరిజం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. భద్రాచలం రామాయణ థీమ్‌పార్క్ ఏర్పాటు, భద్రాద్రి గోదావరి, కిన్నెరసాని అభయారణ్యం, సింగరేణి గనులు, కేటీపీఎస్ పవర్‌ప్లాంట్స్, ఐటీసీ, హెవీ వాటర్‌ప్లాంట్ వద్ద వినోదంతోపాటు వైజ్ఞానికంగా పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా పర్యాటక అభివృద్ధి చేయాలని మంత్రి జూపల్లిని తుమ్మల కోరారు.

మంత్రి జూపల్లితో మంత్రి తుమ్మల భేటీ

మొక్కలను బాధ్యతగా పెంచాలి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విజయవంతంగా ముగిసిన స్వచ్ఛదనం-పచ్చదనం

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 9 : అడవుల్లో పచ్చదనం పెంపొందించేందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని, అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచడానికి పూనుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ముగింపు సందర్భంగా కొత్తగూడెం గణేశ్ టెంపుల్ నుంచి రేగళ్ల క్రాస్‌రోడ్ వరకు మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ చేశారు. అనంతరం చాతకొండ బీట్ కొత్తగూడెం రేంజ్, డివిజన్ పరిధిలో 50 ఎకరాల్లో అటవీ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం, కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు. అడవులు నరికివేతకు గురికాకుండా అటవీ అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని అన్నారు. భూ సమస్యల విషయంలో అటవీ అధికారులకు రెవెన్యూ శాఖ తరపున ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కొత్తగా పోడు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ శాఖలో అమరుడైన ఎఫ్‌ఆర్వో సీహెచ్.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు 500 గజాల స్థలానికి సంబంధించిన పట్టాను వారం రోజుల్లో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీసీఎఫ్ భీమానాయక్, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎఫ్‌డీవో కోటేశ్వరరావు, అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న మంత్రి పొంగులేటి

సాంకేతికతను జోడిస్తూ బోధించాలి : డీఈవో

చింతకాని, ఆగస్టు 9 : ఉపాధ్యాయులు సాంకేతికతను జోడిస్తూ విద్యార్థులకు బోధించాలని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. చింతకాని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి అమలుపై హెచ్ఎంలు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక భాషా గణిత సామర్థ్యాలను ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాటించాలన్నారు. చిన్నారుల్లో పఠన, అభ్యసనా సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తూ.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల తదితర కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయని, విద్యార్థులకు సన్నబియ్యం, రాగిజావ, ఉదయం అల్పాహారం, వారానికి మూడు గుడ్లతో నాణ్యమైన భోజనంతోపాటు శారీరక, మానసిక అంశాలవారీగా బోధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు రవికుమార్, రామకృష్ణ, ఎంఈవో శ్యాంసన్, కాంప్లెక్స్ హెచ్ఎంలు బీవీ శర్మ, శ్రీనివాసరావు, ఎంఎన్‌వో శ్రీనివాసరావు, ఆర్పీలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర శర్మ

ఆఫ్ లోడింగ్ కార్మికులకు ఈపీఎఫ్ ఎగనామం..

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దసంస్థ అయిన సింగరేణిలో ఉద్యోగులతోపాటు ఓపెన్‌కాస్టుల్లో పనిచేస్తున్న ఆఫ్ లోడింగ్ కార్మికుల పాత్ర కూడా ఎంతో చెప్పుకోదగినది. సింగరేణి సంస్థ సాధిస్తున్న లాభాల్లో వీరి చెమట చుక్కలు కూడా ఉన్నాయి. అయితే ఆఫ్ లోడింగ్ కార్మికులకు ఈపీఎఫ్ చెల్లింపులు జరగడం లేదు.. అయినా సింగరేణి అధికారులు మిన్నకుంటున్నారు. న్యాయబద్ధంగా వారికి రావాల్సిన ఈపీఎఫ్ చెల్లింపులో జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ కూడా ఏమీ చేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. రూ.కోట్లలో ఈపీఎఫ్‌లను చెల్లించకుండా గుత్తేదారులు ఎగ్గొడుతూ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నా ఇటు కార్మికసంఘాలు మౌనం దాల్చుతుండగా.. అటు రాజకీయ పార్టీలు నోరు మెదపడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఉద్యోగం పోతుండడంతో ఆఫ్ లోడింగ్ కార్మికులు తమ ఆవేదనను తమలోనే దిగమింగుతున్నారు.

– రామవరం, ఆగస్టు 9

- కోట్లాది రూపాయలు ఎగ్గొడుతున్న కంపెనీలు
- ప్రశ్నిస్తే ఉద్యోగం ఊస్టే.. కార్మికుల మౌనరోదన
- మిన్నకుంటున్న సింగరేణి అధికారులు
- మౌనం వహిస్తున్న కార్మికసంఘాలు... నోరుమెదపని రాజకీయ పార్టీలు
- సింగరేణిలో ఓబీ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

సింగరేణి సంస్థ ఓపెన్‌కాస్టు గనుల్లో ఆఫ్ లోడింగ్ పనుల(మట్టి తొలగింపు పనులు)ను ప్రైవేట్ వారికి టెండర్ల ద్వారా కేటాయిస్తున్నది. ఎవరు టెండర్‌లో అర్హత సాధిస్తే వారికి పనులను అప్పగిస్తారు. క్వారీలో ఉన్న మట్టిని తొలగించేందుకు ఓల్వో డ్రైవర్లను, ఇతర మిషనరీలను నడిపే డ్రైవర్లను, మిగతా పనులు చేసేందుకు సంబంధిత కంపెనీలు నియమించుకుంటారు. వీరికి ఇచ్చే జీతంలో ఉద్యోగి(ఎంప్లాయి) నుంచి 12శాతం, కంపెనీ నుంచి 12 శాతం వీరి జీతాల నుంచి ఈపీఎఫ్‌కు మళ్లిస్తారు. ఇందులో 8.33 శాతం భవిష్యత్తులో ఉద్యోగి పెన్షన్ కోసం జమ అవుతుంది. కానీ చాలా కంపెనీల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించడం లేదు. ప్రతి నెల వీరికి జీతాన్ని చెల్లించే ముందురోజు వీరికి జీతం చిట్టి(పేమెంట్ స్లిప్)ను విధిగా ఇవ్వాలి. ఇందులో ఉద్యోగి నుంచి, కంపెనీ నుంచి ఎంత కట్ అవుతుంది తదితర అంశాలకు సంబంధించి వివరాలు పొందుపర్చి ఉంటాయి. కానీ ఇవెక్కడా కూడా ఆచరణలో కనిపించవు. నగదు జమకు సంబంధించిన సమాచారాన్ని సెల్‌ఫోన్‌లో మెసేజ్‌ల ద్వారా పంపించాల్సి ఉంటుంది. కానీ ఇందులో పంపించే సందేశంలో కూడా చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా ఈపీఎఫ్ కడుతున్నామని మభ్యపెడుతూ ఉంటారు.

నోరుమెదపని కార్మికసంఘాలు, రాజకీయ పార్టీలు

ఇంత జరుగుతున్నా కార్మికసంఘాలు ఈ అన్యాయంపై ప్రశ్నించవు. రాజకీయ పార్టీలైతే అది తమకు సంబంధించిన అంశం కాదన్నట్లు వ్యవహరిస్తుంటాయి. ఇప్పటికీ చాలా ఓసీల్లో కోట్లలో ఈపీఎఫ్ రూపంలో కార్మికులకు చెల్లించాల్సిన నగదును చెల్లించకుండా ఆయా కంపెనీలు వెళ్లిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. కార్మికుల హక్కుల కోసం వారిపక్షాన ఉండి మాట్లాడాల్సిన కార్మిక సంఘాలు మౌనం వహించడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో జీకేవోసీలో పనిచేసే ఒక సంస్థ కార్మిక సంఘాలకు ప్రతి నెల వారికి నెలవారీ మామూళ్లు ఇచ్చేది. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో 12 కుక్కలను సాదుతున్నామనే అహంకారంతో మాట్లాడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అంటే కార్మికసంఘాలు ఏ స్థాయికి దిగజారిపోయాయో ఈ ఒక్క మాటతోనే అర్థం చేసుకోవచ్చు.

ఓబీ కాంట్రాక్టర్లకు భయపెడుతున్న అధికారులు

సంస్థలో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు ఆయా ఏరియాలకు టార్గెట్‌ను విధించడంతో టార్గెట్‌లపైనే దృష్టి తప్ప ఈ టార్గెట్‌ను చేరుకోవడానికి ఆఫ్‌లోడింగ్ కార్మికులు పడుతున్న బాధలు ఎవరికీ పట్టడంలేదు. ఓబీ నిర్వహించే కాంట్రాక్టర్ చెప్పిందే వేదంగా సింగరేణి నడుస్తుందనే అనుమానాలు కలుగుతున్నాయి. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటే పని ఆపడం వల్ల తమకు నిర్దేశించిన టార్గెట్ పూర్తికాదని, టార్గెట్ లక్ష్యాన్ని అస్త్రంగా చేసుకొని కాంట్రాక్టర్‌లు సింగరేణి అధికారులను భయపెడుతున్నారు. చర్యలు తీసుకుందామంటే ఓబీ పనులు ఆగితే టార్గెట్ పూర్తి కాదు, పై అధికారుల నుంచి అక్షింతలు పడతాయి, మనకెందుకు మన జీతం మనకొస్తుంది... ఒకరి జీవితం మనకెందుకు అన్న చందాన వ్యవహరించడంతో సింగరేణిలో కాంట్రాక్టర్లదే రాజ్యం నడుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల మౌనం.. కాంట్రాక్టర్లకు వరం?

సింగరేణి టెండర్‌లో పిలిచిన దాని కంటే తక్కువగా కోడ్ చేసి పనులు చేజిక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను ఆపివేసి ఉద్యోగులకు చెల్లించాల్సిన ఈపీఎఫ్‌లు చెల్లించకుండా ముక్కుపిండి వసూలు చేయాల్సిన అధికారులు మౌనం వహించడంతో కాంట్రాక్టర్లకు వరంగా మారుతోంది. 1948 మినిమం వేజెస్ యాక్టు ప్రకారం సంబంధిత కాంట్రాక్టర్ పీఎఫ్ చెల్లించని పక్షంలో ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా సంస్థే చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా వీరికి ప్రతి 15రోజులకు ఒకసారి వీరు చేసిన పనికి బిల్లులను చెల్లిస్తుంటారు. బిల్లులు చెల్లించే సమయంలో వీరు ఈపీఎఫ్ కట్టని పక్షంలో ముక్కుపిండి వసూలు చేసే అధికారం వీరికి ఉన్నా కానీ వీరి ఉదాసీనత వైఖరి వల్ల అనేకమంది కార్మికులు ఈపీఎఫ్‌ను పొందక తమకు రావాల్సిన హక్కులను కోల్పోతున్నారు.

జీతం చిట్టి(పే స్లిప్) ఇచ్చిందే లేదు..

నేను సత్తుపల్లిలోని జీకేఆర్ సంస్థలో ఓల్వో డ్రైవర్‌గా విధులునిర్వహించాను. నాకు ఏ రోజు కూడా జీతం చిట్టి ఇవ్వలేదు. నాకెంత ఈపీఎఫ్ కట్ అవుతుందని, దీనిలో నా భాగం ఎంత, సంస్థ ఎంత చెల్లిస్తుంది, బోనస్ ఏమన్నా చెల్లించిందా తదితర అంశాలకు సంబంధించిన వివరాలు ఎప్పుడూ ఇవ్వలేదు. నాకు రూ.21 వేల జీతం వచ్చేది. కానీ దానిమీద 12 శాతం నాది, 12 శాతం కంపెనీది రావాలి కానీ. నాకెప్పుడు మెసేజ్ వచ్చినా కేవలం రూ.1300 మాత్రమే చూపించేది. పీఎఫ్ లేనప్పుడు పని ఎందుకని బంద్ చేశాను.

– రొంటాల లింగం, ఆఫ్‌లోడింగ్(డ్రైవర్) కార్మికుడు

ప్రశ్నిస్తే ఉద్యోగం తీసేస్తారు..

కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం తరపున ఎవరైనా ఓబీలో పనిచేసే డ్రైవర్లు ఈపీఎఫ్‌పైన ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారు. వీరు చేస్తున్న ఆగడాలను సంస్థ దృష్టికి కూడా తీసుకెళ్లాం. అయినా ప్రయోజనం లేదు. ఇప్పటికే కార్మికశా